వ్యర్థాల తరలింపునకు నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

- బక్రీద్ సందర్భంగా 45 వేల ప్లాస్టిక్ కవర్ల పంపిణీ పూర్తి
- అదనంగా 54 మంది కార్మికులు, 18 వాహనాలు
- సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్



రాజేంద్రనగర్: బక్రీద్ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో వ్యర్థాల సేకరణకు సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, 45 వేల ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశామని సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. సులేమాన్ నగర్, శాస్త్రిపురం, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో ఆదివారం ఆయన పర్యటించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంగళవారం సాయంత్రం వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. ఈ డ్రైవ్‌లో ప్రతిరోజు పారిశుద్ధ్య విభాగంలో పాల్గొనే సిబ్బందితో పాటు అదనంగా 54 మంది కార్మికులను నియమించామన్నారు. వ్యర్థాల తరలింపునకు 5 జేసీబీలతో పాటు 18 వాహనాలను సిద్ధం చేశామన్నారు. ఐదు డివిజన్లలో ఆటో రిక్షాలు ఇంటింటికీ తిరుగుతూ వ్యర్థాలను సేకరించాలని ఆదేశించామని చెప్పారు. 140 ఆటోల ద్వారా వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామన్నారు. వ్యర్థాలను కవర్లలో వేసి ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై వ్యర్థాలను వేయవద్దన్నారు.

మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి

సొంత నిధులతో బోరు వేయించిన డిప్యూటీ మేయర్



శాంతినగర్‌లో బోరును ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ 15వ వార్డులోని శాంతినగర్ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి తన సొంత ఖర్చుతో బోరును వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను తీర్చేందుకు బాధ్యతగా తన సొంత డబ్బును ఖర్చు చేస్తున్నానన్నారు. ప్రజలకు అసౌకర్యాలు కలుగకుండా చూడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. గతంలో నీటి ఎద్దడి కారణంగా శాంతినగర్ కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను తన దృష్టికి తేవడంతో స్పందించి బోరు వేయించానన్నారు. ఆదివారం బోరు పనులు పూర్తయ్యాయని, ఇక నీటి సమస్య ఉండదని అన్నారు. బోరు వేయించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, సభ్యులు పాల్గొన్నారు.

కురుమ సంఘం అభివృద్ధికి చొరవ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కురుమ

బండ్లగూడ: కురుమ సంఘం అభివృద్ధికి సభ్యులు చొరవ చూపాలని ఆ సంఘం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కురుమ అన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సమావేశం సంధ్యానగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని కురుమ కులస్తులందరిని సంఘంలో సభ్యులుగా చేర్చాలని కోరారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రతి నెల సంఘం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు మల్లేష్ కురుమ, కార్యదర్శి బి.బాబురావు కురుమ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.సత్యనారాయణ కురుమ, సభ్యులు జగదీష్ కురుమ, కృష్ణయ్య కురుమ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీ



సాక్షి, సిటీబ్యూరో: మణికొండలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో ఆదివారం శ్రీ ఆద్య అకాడమీని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడమీ ద్వారా విద్యార్థులకు ఐఐటీ సీట్లు సాధించేలా ఉత్తమ కోచింగ్ ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ అనూప్‌కుమార్, ఎండీ అనిత తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం: కౌసర్



అదనపు డీసీపీ అష్వాక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అష్వాక్ ఆదివారం ఎమ్మెల్యేను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తమ పరిధిలోని ఈద్గాలు, జామా మసీదులతో పాటు బక్రీద్ ప్రార్థనలు జరిగే మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాట్లపై అదనపు డీసీపీ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో పోలీసులను నియమించాలని కోరారు. నానల్‌నగర్, టోలిచౌకీ చౌరస్తా, గోల్కొండ, రేతిబౌలి తదితర ప్రాంతాల్లో గొర్రెల విక్రయాలు బాగా జరుగుతాయని ఆయన అన్నారు. ఈ ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఎమర్జెన్సీ పోలీసు వాహనాలను కూడా నియమించాలని ఆయన అదనపు డీసీపీని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ...

ఎన్నికల కోడ్ ముగిసినందున గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ సహాయం అందడం ప్రారంభమైందని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. ఆదివారం ఆయన మెరాజ్ కాలనీలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు చెక్కు కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదని తానే సంబంధిత అధికారులను సంప్రదించి చెక్కులు త్వరగా మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నానన్నారు.

'బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం'



గాజుల అంజయ్యను సన్మానిస్తున్న ప్రతినిధులు

చార్మినార్: ఈసారి బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. హరిబౌలిలోని మహేశ్వరి పోచమ్మ మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు దినేష్ ఆధ్వర్యంలో ఆదివారం మీరాలంమండిలో ఆయనను కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తమతమ ఆలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం వెంటనే వినతి పత్రాలను అందజేయాలన్నారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ పాటిల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ యాదవ్‌లతో పాటు ప్రభునాథ్, శ్రావన్‌కుమార్, సంగ ప్రకాష్, సుశీల్ పాల్గొన్నారు.

లలితాబాగ్‌లో..

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్‌లోని నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎడ్ల పండరీనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బోనాల ఉత్సవాల నిర్వహణపై ఈ సందర్భంగా చర్చించారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ మధుకర్, సలహాదారుడు అనంత రామారావు, ఉపాధ్యక్షులు రూపేష్, మస్కు వేణు కుమార్‌తో పాటు మధుసూదన్, ధన్‌రాజ్, జగదీష్ పాల్గొన్నారు.

నడి రోడ్డే బస్టాప్!

- బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు
- రద్దీతో సగం రోడ్డు వరకు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి
- ప్రయాణికులు, వాహనాలతో ట్రాఫిక్ తిప్పలు



జాతీయ రహదారిపై బస్సుల కోసం రోడ్డుపై వేచియున్న ప్రయాణికులు

శంషాబాద్ : పద్దెనిమిదేండ్లుగా ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. పట్టణంలో బస్టాప్ ఏర్పాటు కోసం స్థానికులు ఎన్ని ఆర్జీలు ఇచ్చినా స్పందన అంతంతే. పాలకులు మారుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. పట్టణంలోని జాతీయ రహదారిపై షాద్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపు వెళ్లే బస్సులతో పాటు అదే రూట్లో వెళ్లే లోకల్ బస్సులకు ఈ నడిరోడ్డే బస్టాప్‌గా కొనసాగుతోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో వందలాది మంది ప్రయాణికులు పెరిగి రోడ్డు మధ్య వరకు నిల్చుంటున్నారు. మరో వైపు ప్రయాణికుల కోసం ఆపే బస్సులు, ఇతర వాహనాలతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్‌హెచ్‌ఏ అనుమతి లేకపోవడంతో..

ఇటీవల ఓ సంస్థ పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో బస్ షెల్టర్ల ఏర్పాటుకు మున్సిపాలిటీకి డిపాజిట్ చెల్లించి అనుమతి తీసుకుంది. ప్రధానంగా బస్సుల కోసం వేచి ఉండే ఈ ప్రాంతంలో షెల్టర్ల ఏర్పాటుకు అధికారులు యోచించినప్పటికీ ఎన్‌హెచ్‌ఏ నుంచి అనుమతి లేకపోవడంతో ముందుకు సాగలేదు. షెల్టర్ ఉంటే ప్రయాణికులకు కొంతైనా ఉపశమనంగా ఉండేది. ప్రస్తుతం ఎండా, వానలకు ఇక్కడే వందల సంఖ్యలో ప్రయాణికులు రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యేక టెర్మినల్ ఏర్పాటు చేస్తే..

షాద్‌నగర్ రూట్లో అన్ని లోకల్ బస్సులు పట్టణంలో బస్టాండ్‌లోకి వెళ్లి వస్తే కొంత వరకు ఇక్కడ రద్దీని నియంత్రించే అవకాశాలున్నాయి. అన్నపూర్ణ చౌరస్తా నుంచి మలుపు తీసుకుని తిరిగి బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న దారి గుండా రావాల్సి ఉంటుంది. ఇది డ్రైవర్లకు ప్రయాస కావడంతో దానికి ఆర్టీసీ అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రావడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగకుండా పట్టణ శివారులో ప్రత్యేక టెర్మినల్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుంది. ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో పాటు ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లారు. సమస్యను స్వయంగా చూశానని, పరిష్కారం చేద్దామని స్థానిక నేతలతో మంత్రి అన్నట్లు తెలిసింది.

బస్సు టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలి



నిత్యం వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం నడి రోడ్డుపై వేచి ఉంటున్నారు. ఇంత వరకు దానిని పరిష్కరించేందుకు ఏ ఒక్కరూ శ్రద్ధ చూపడం లేదు. కనీసం నీడ కూడా లేని చోట వందల మంది బస్సుల కోసం ఆగచాట్లు పడుతున్నారు. పాత బస్టాండ్‌ను ఆధునీకరించడంతో పాటు కొత్తగా అందరికి అనువైన చోట మరో బస్సు టెర్మినల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– వి. జనార్దన్, విశ్రాంత సైనికుడు

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని సర్కిల్ కార్యాలయంలోని మొదటి అంతస్తు మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజావాణికి జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది హాజరవుతారని తెలిపారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ క్లబ్‌లో చేరిన బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: గ్రీన్ ఎనర్జీ క్లబ్‌లో గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్ చేరింది. అపార్ట్‌మెంట్‌లో 234 కిలోవాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సోలార్‌ప్లాంట్‌ను అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సోలార్‌పవర్ ప్లాంట్‌ను అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేషన్ సోలార్ కమిటీ సభ్యుడు పివిరెడ్డి పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని పాతనగర మున్నూ రు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు అన్నారు. గత నెల తమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామన్నా రు. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకు న్న వారికి ఆదివారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి తనతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి బి ట్ల హంసరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.చంద్ర కుమార్ తదితరుల ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం జరిగిందని.. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు, సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకర్, బల్లేపు ఉపేందర్, పల్లే శ్రావణ్, భారత్ కుమార్, పోసూ క్రిష్ణ, అల్లం భానుమూర్తి, శ్రీధర్‌రావు, కిషన్‌రావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

డాక్టర్ రాహుల్‌కు అవార్డు ప్రదానం



ప్రశంసాపత్రం, అవార్డు అందుకుంటున్న రాహుల్


అత్తాపూర్ : నగరానికి చెందిన యువ డాక్టర్ మాడ్యం రాహుల్ గుండెజబ్బుతో బాధపడుతున్నవారికి ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారు. అతడి సేవలకు డాక్టర్ కాళహస్తి ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేశారు. ఆదివారం అవార్డును రాహుల్ అందుకున్నారు. నగరానికి చెందిన సామాజిక సేవకుడు మాడ్యం రామేశ్వర్‌రావు కుమారుడు డాక్టర్ రాహుల్ హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. అమెరికాలోని వర్జీనియా వైద్య విశ్వ విద్యాలయంలో గుండె జబ్బుల నివారణ కోర్సులో పీజీ పూర్తైంది. నాటి నుంచి ఆయన గుండె జబ్బుతో బాధపడుతున్న అనేక మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సేవలకు అవార్డు రావడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

సాయిబాబా ఆలయంలో చోరీ



సాయి బాబా దేవాలయం

అత్తాపూర్ : సాయిబాబా ఆలయంలో హుండీ పగలగొట్టి రూ. 10 వేల నగదు, రెండు వెండి పాదాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఏఎస్‌ఐ నందగోపాల్ గౌడ్ వివరాల ప్రకారం .. అత్తాపూర్ నంది ముసలై చౌరస్తాలోని సాయిబాబా గుడి వెనుక భాగం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీని, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న పూజారి యోగేశ్, వాచ్‌మెన్ అనిల్ ఆలయంలో హుండీని చూసి చోరీ జరిగిందని గుర్తించారు. హుండీలోని నగదు, రెండు వెండి పాదాలు తదితర వస్తువులను చోరీ చేశారని గుర్తించి పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా త్వరలోనే నిందితులను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.



అ'పూర్వ' సమ్మేళనం

శేరిలింగంపల్లి: పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. శేరిలింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ విద్యార్థులంతా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు మళ్ళీ ఒకసారి పరిచయం చేసుకుంటూ, పాత జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ మళ్ళీ విద్యార్థులుగా మారిపోయారు. కాగా ఒకరినొకరు పలకరించుకుంటూ కుటుంబ వివరాలు అడుగుతూ ఆనందంగా గడిపారు. ఈ సమావేశానికి తాము చదివే సమయంలో ఉన్న టీచర్ మల్లేషంను పిలిచి ఘనంగా సత్కరించారు. అనంతరం తాము చదివిన పాఠశాలకు ప్రింటర్‌ను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అక్బర్, శంకర్, మల్లేష్, రవితేజ, భూపాల్‌రెడ్డి, జీవన్, మల్లకార్జున్, ప్రకాశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎంఎన్‌జేలో అన్నదానం

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని టీఎన్జీటీస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పలు సంవత్సరాలుగా పనిచేస్తూ, కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శుభ సందర్భంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 600 మంది నిరుపేద రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. కేన్సర్ బారిన పడిన పేద రోగు లకు అన్నదానం చేయడం దేవుడు తనకిచ్చిన గొప్ప వరం అని ముజీబ్‌హుస్సేని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు కేఆర్. రాజ్‌కుమార్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, బొల్లిగిద్ద శంకర్, మొహ్మద్ వహీద్, ముస్తఫా, షరీఫ్, ఆసుపత్రి సభ్యులు శివకుమార్, మొహ్మద్ హబీబ్, చావూష్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్ : మండలంలోని మదన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని చెరువులు, కుంటల కబ్జాను అరికట్టి, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. సర్వే నెంబరు 37లో 47 ఎకరాల విస్తీర్ణం ఉన్న నల్లచెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు కబ్జా చేస్తున్నాయని వారు ఆరోపించారు. అదేవిధంగా సర్వే నెంబర్ 8లో గర్వోని కుంటను కూడా కబ్జా చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, రియల్టర్లు కలిసి అధికారులతో కుమ్మక్కై జల వనరులను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేవారు. చెరువులు, కుంటలను ఆనుకుని భారీగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టారన్నారు. కబ్జాలు చేయడమే కాకుండా నీటి వరదకు అడ్డుకట్ట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలను అడ్డుకునేందుకు కబ్జాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా కబ్జాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్, నర్సింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో ఘనంగా బొడ్రాయి వేడుకలు



బొడ్రాయి వేడుకలో పాల్గొన్న ప్రజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లో బొడ్రాయి 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయిని అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామ పెద్దలు తగు చర్యలు తీసుకున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మైలార్‌దేవ్‌పల్లి : సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి యోగా దోహదపడుతుందని రామకృష్ణ యోగా సెంటర్ శిక్షకుడు డాక్టర్ పోతన్న అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లోని డాక్టర్ పోతన నివాసంలో శ్రీ రామకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇచ్చి వారికి ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాపై ప్రపంచంలో ఎంతో మంది ఆసక్తి చూపుతున్నారని అన్నారు. యోగా పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ ద్వారా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెస్పాల్ సింగ్, యోగా గురువులు మూల్చంద్, శర్మ అజిత్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న యోగా గురువు పోతన్న

నేడు ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వివిఎస్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ఉదయం 5.30 గంటలకు షిర్డీసాయిబాబాకు కాగడ హారతి కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన చేస్తారు. అనంతరం గణపతి, దత్తాత్రేయ స్వామి, షిర్డీసాయిబాబాకు పంచామృతాభిషేకం, మంగళస్నానాలు వంటి కార్యక్రమాలు చేస్తారు. అనంతరం రాత్రి 9 గంటలకు శేజ్ హారతితో వార్షికోత్సవాలను ముగిస్తారు.

వాసవిక్లబ్ కపుల్స్ సేవా కార్యక్రమాలు



ఖాజాగూడలోని ప్రభుత్వ పాఠశాలకు నీళ్ల ట్యాంకులు అందజేస్తున్న వాసవిక్లబ్ కపుల్స్

రాయదుర్గం: పలు సేవా కార్యక్రమాలను మణికొండలోని వాసవిక్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వాసవి ఆదేశాలపై 'డాన్ టు డస్క్ సేవా' కార్యక్రమాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గచ్చిబౌలిడివిజన్‌లోని ఖాజాగూడలోని ప్రభుత్వ పాఠశాలకు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన నీళ్ళ ట్యాంకు, 20 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కానిస్టేబుళ్ళకు మాస్కులు, టవల్స్, స్ట్రీట్ వెండర్‌కి గొడుగులు, ఆరు సభ్యుల చేత ఆర్గాన్ డోనర్ చేయించడం, వాసవి అమ్మవారి ఆలయంలో సేవా కార్యక్రమాలను వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్‌లోని ఈసీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వాసవిక్లబ్ కపుల్స్ అధ్యక్షులు వంటవీటి వంశీకృష్ణ, కార్యదర్శి తల్లాడ యశ్వంత్ పాల్గొన్నారు.